# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రాయికోడ్‌లో మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

- రాయికోడ్ మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

రాయికోడ్, జనవరి 3: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం రాయికోడ్‌లో ఏర్పాటు చేసిన ప్రజపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకాలు అమలు చేశామన్నారు. మిగతా గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు చేపట్టనున్న గ్రామ సభల్లో ఆయా పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాయికోడ్ మండలం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని తెలిపారు. మంత్రి మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించి, రశీదులు అందజేశారు. సింగితం గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సీఈవో ఎల్లయ్య, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి జగదీశ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశం, ఎంపీపీ మమతాఅశోక్‌కుమార్, మాజీ జడ్పీటీసీ అంజయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ యేసయ్య, సర్పంచ్ కేదారినాథ్‌పాటిల్, ఎంపీటీసీ మొగులప్ప, ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు మక్సూద్, సతీశ్ పంతులు, శివకుమార్, డాక్టర్ వెంకటేశం, నాగరాజుగౌడ్, దుర్గేశ్, సునీల్ పాల్గొన్నారు.

# హామీలు విస్మరిస్తే ఉద్యమిస్తాం

- రైతుభరోసా పెట్టుబడి సాయం అందజేయాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- నవాబ్‌పేటలో ప్రజాపాలన



నవాబ్‌పేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, జనవరి 3 : కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరిస్తే ప్రజల తరపున ఉద్యమిస్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నవాబ్‌పేట గ్రామంలో సర్పంచ్ అశోక్‌రెడ్డి, ఎంపీడీవో భారతితో కలిసి ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ రైతులకు పంటపెట్టుబడి సాయం కింద డిసెంబర్ 9వ తేదీ నుంచి రైతుభరోసా అందజేస్తామని చెప్పిందని, జనవరి 9వ తేదీ వస్తున్నా ఇప్పటి వరకు రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడం బాధాకరమన్నారు. క్వింటాలు వరికి రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ఈ నెల 6 వరకు ప్రజాపాలన కొనసాగుతుందని, ప్రజలు ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కొత్త రేషన్ కార్డు మంజూరుకు దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. మండలంలోని నవాబ్‌పేటతోపాటు దొంతి, లచ్చిరెడ్డిగూడెం, గుండ్లపల్లి గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మన్సూర్, సర్పంచులు ఏనుగు అశోక్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, పెంజర్ల శ్రీనివాస్ యాదవ్, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, నల్ల రవిగౌడ్, మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో...**

నర్సాపూర్, జనవరి 3 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగులపల్లిలో 'ప్రజాపాలన' ప్రారంభించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో మహిళలకు ప్రతినెలా రూ.2500, వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500 అందించాలన్నారు. రైతుభరోసా పథకంలో ఎకరానికి ఏటా రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి, సర్పంచ్ సేనాధిపతి, ఎంపీటీసీ మేఘమాలకిషన్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకుడు సత్యంగౌడ్ పాల్గొన్నారు.

# కోర్ ఇంజినీరింగ్‌కు మంచి భవిష్యత్

- గీతం అధ్యక్షుడు శ్రీభరత్
- గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ ఆధ్వర్యంలో టన్నెలింగ్‌పై వర్క్‌షాపు



వర్క్‌షాప్‌కు వచ్చిన అతిథులను సత్కరిస్తున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

పటాన్‌చెరు, జనవరి 3 : కోర్ ఇంజినీరింగ్‌కు మంచి భవిష్యత్ ఉందని గీతం వర్సిటీ అధ్యక్షుడు శ్రీభరత్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ ఆధ్వర్యంలో టన్నెలింగ్‌పై నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంప్రదాయకం ప్యూటర్ సైన్స్ ఉద్యోగాలపై కృత్రిమ మైథ ప్రభా వం చూపుతున్నదన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, వంటి కోర్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లకు ప్రాధాన్యత పెరుగుతున్నదన్నారు. కృత్రిమ మేథతో కంప్యూటర్ సైన్స్ ఉద్యోగాలపై క్రమంగా ప్రభావం పడుతుందన్నారు. అదే సమయంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ.7.50 లక్షల కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తున్నదన్నారు. వర్ధమాన ఇంజినీర్లకు ఇదో మంచి అవకాశమన్నారు. టన్నెలింగ్, భూగర్భంలో నిర్మాణాలు చేపట్టడం.. నిర్మాణాలు చేపడ్డంపై లోతైన జ్ఞానాన్ని అందించే లక్ష్యంతో నిర్వహించిన కార్యక్రమంలో పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, ప్రస్తుతం నవరత్న హోదా మహారత్నగా మారబోతున్న విషయాన్ని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎస్కే చౌరాసియా చెప్పారు. 2040 వరకు భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారబోతుందన్నారు. నవంబర్‌లో ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారా టన్నెల్ ప్రమాదం, అందులో చిక్కుకున్న వారిని కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు, ఉపయోగించిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని స్క్రాడ్రోన్ ఇన్‌ఫ్రా అండ్ మైనింగ్ ఎండీ, ముఖ్య కార్యనిర్వహణాధికారి సిరియాక్ జోసెఫ్ వివరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ స్టాఫ్ ఆఫ్ ఇండియా సలహాదారు ప్రొఫెసర్ డీవీ రెడ్డి, సిరియాక్ జోసెఫ్, గీతం కోర్ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ రామశాస్త్రి డాక్టర్ అఖిలేశ్ చేవూరి, ప్రొఫెసర్ శ్రీనివాస్, సత్యనారాయణ, బ్రహ్మారెడ్డి, మాధవి, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ పాల్గొన్నారు.

# సంగారెడ్డి కలెక్టర్ శరత్ బదిలీ



డాక్టర్ శరత్

- జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి
- ప్రశాంతంగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన శరత్
- కొత్త కలెక్టర్‌గా వల్లూరు క్రాంతి నియామకం
- త్వరలో బాధ్యతల స్వీకరణ

సంగారెడ్డి, జనవరి 3 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్ బదిలీ అయ్యారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం 26 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా శరత్‌ను బదిలీ చేసింది. సంగారెడ్డి కొత్త కలెక్టర్‌గా వల్లూరు క్రాంతి నియమితులయ్యారు. గద్వాల జోగులాంబ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న క్రాంతిని సంగారెడ్డి కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. శరత్‌ను గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శిగా నియమించింది. శరత్ సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా 18 జూన్, 2022న బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్‌గా ఏడాదిన్నర పనిచేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రతి సోమవారం ప్రజావాణిలో ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించారు. జిల్లాలో పర్యటిస్తూ కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యేలా చూశారు. జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారు. సంగారెడ్డి జిల్లాలో 'మనఊరు-మనబడి' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాలు మెరుగయ్యేలా చూశారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు అవసరమైన భూసేకరణ త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకున్నారు. మునిపల్లి మండలంలో ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలను సంగారెడ్డి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కలెక్టర్ శరత్ చర్యలు తీసుకున్నారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు.

**-కొత్త కలెక్టర్ వల్లూరి క్రాంతి**

సంగారెడ్డి జిల్లా కొత్త కలెక్టర్‌గా వల్లూరు క్రాంతి నియామకమయ్యారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన క్రాంతి మహబూబ్‌నగర్ జిల్లా డీఆర్డీవోగా, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. సెప్టెంబర్ 2021న జోగులాంబ గద్వాల కలెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం జోగులాంబ గద్వాల కలెక్టర్‌గా ఉన్న క్రాంతిని ప్రభుత్వం సంగారెడ్డి కలెక్టర్‌గా బదిలీ చేసింది. కర్నూలు జిల్లాకు చెందిన క్రాంతి హైదరాబాద్, ఐఐటీ ఢిల్లీల్లో చదువుకున్నారు. 2016లో ప్రకటించిన యూపీఎస్సీ ఫలితాల్లో 65వ ర్యాంకు సాధించింది. 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి క్రాంతి నిర్మల్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో వేర్వేరు హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం సంగారెడ్డి కలెక్టర్‌గా బదిలీ అయిన వల్లూరు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# 'ప్రజాపాలన' విజయవంతం చేయాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల తనిఖీ

టేక్మాల్, జనవరి 3 : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని మెదక్ కలెక్టర్ రాజర్షిషా బుధవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు చేరువయ్యేలా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దరఖాస్తుల్లో సమస్యలు ఏమైనా తలెత్తుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. కేజీబీవీలోని సావిత్రీబాయి పూలే 193 జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాలలో పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదర్శ పాఠశాలలోని క్రీడామైదానాన్ని పరిశీలించి, వసతులను కల్పించాలన్నారు. త్వరలో వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డికి సూచించారు. క్రీడా మైదానం చుట్టూ రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం కేజీబీవీ నుంచి ఆదర్శ పాఠశాల వరకు సీసీ రోడ్డు మంజూరు గురించి అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో రాధాకిషన్, కేజీబీవీ ప్రత్యేకాధికారి బాలమణి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, వెంకటాపూర్ సర్పంచ్ లచ్చాగౌడ్, రెవెన్యూ సిబ్బంది, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

వెంకటాపూర్‌లో మహిళలతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా

